క్లుప్తంగా

స్పేస్ ఫిజిక్స్‌పై అవగాహన



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వ విద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో న్యూఢిల్లీలోని ఎన్విరాన్‌మెంటల్ డిఫెన్స్ ఫండ్ సీనియర్ సైంటిస్ట్ అడ్వైజర్ డాక్టర్ వి.శ్రీకాంత్ ప్రత్యేక ప్రసంగం చేశారు. అట్మాస్పియర్, స్పేస్ ఫిజిక్స్ అంశాలపై విద్యార్థులు, పరిశోధకులకు అవగాహన కల్పించారు. బేసిక్స్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్– లేటెస్ట్ ట్రెండ్స్ అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, ఆచార్య కె.నిరంజన్, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన యూజీసీ అధికారి



గోపీచంద్‌కి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని యూజీసీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ ఎం.గోపీచంద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వీసీ ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీచంద్‌ని ఏయూ తరఫున సత్కరించి, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఓఎస్‌డీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రాజమాణిక్యానికి అభినందన



డాక్టర్ రాజమాణిక్యాన్ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాజమాణిక్యాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు. ఇటీవల ఆచార్య రాజమాణిక్యం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్పెషల్ ఎక్స్‌క్లూజివ్ ఆనర్ 2024, నారీ శక్తి 2024 అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను వీసీ తన కార్యాలయంలో అభినందించారు. వర్సిటీ అధికారులు, ఆచార్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

30 నుంచి ఫొటోగ్రఫీ ప్రదర్శన

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగంలో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ నెల 30, 31 తేదీల్లో ఫొటోగ్రఫీ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రదర్శనను ప్రారంభిస్తారు. ఆ రెండు రోజులు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రదర్శన ఉంటుంది. విద్యార్థులు తాము కెమెరాలో బంధించిన అపురూప క్షణాలను, చిత్రాలను ఇక్కడ ప్రదర్శిస్తారు. వైల్డ్ లైఫ్, ఫుడ్, బేబీ ఫొటోగ్రఫీ, వెడ్డింగ్, ఆర్కిటెక్ట్, ట్రావెల్ ఫొటోగ్రఫీ రంగాల్లో వైవిధ్యాన్ని చూపుతూ కోర్సు అభ్యసిస్తున్న 22 మంది విద్యార్థులు తీసిన చిత్రాలు ప్రదర్శనలో కొలువుదీరనున్నాయి.

అద్భుతమనిపించేలా..



11వ వార్డులో నిర్మించిన యూపీహెచ్‌సీ

జీవీఎంసీ 11వ వార్డులో అభివృద్ధి పరవళ్లు తొక్కుతోంది. చక్కటి రోడ్లు, ఆధునికీకరించిన కాలువలు, ప్రజలకు అందుబాటులో అర్బన్ హెల్త్ సెంటర్, సామాజిక భవనాల నిర్మాణం వంటివి జరిగాయి. ఇక్కడి ప్రజల శుభకార్యాల కోసం రూ. 8 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. 2019 నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ. 22 కోట్లతో 49 పనులు చేపట్టి ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

- 11వ వార్డులో అభివృద్ధి పరుగులు
- రూ. 22 కోట్లతో రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం
- అర్బన్ హెల్త్ సెంటర్లు, సామాజిక భవనాల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఆరిలోవ : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. రోడ్లు, కాలువలు, రక్షణ గోడలు, కల్వర్టుల నిర్మాణం, గెడ్డల ఆధునికీకరణ, ప్రజలకు చేరువలో అర్బన్ హెల్త్ సెంటర్లు (యూపీహెచ్‌సీ), సామాజిక భవనాలను నిర్మించి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తోంది. ఇందులో భాగంగా జీవీఎంసీ 11వ వార్డులో సుమారు రూ. 22 కోట్ల జీవీఎంసీ నిధులతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. కొన్ని పనులు కొనసాగుతున్నాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆరిలోవ ప్రాంతాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. కార్పొరేషన్ ఎన్నికలు జరిగిన తర్వాత వార్డులో మరింత అభివృద్ధి జరిగింది. 2019–20లో వార్డులో రూ.75 లక్షలతో మూడు పనులు, 2021 నుంచి 2024 వరకు (ఇంత వరకు) సుమారు రూ.19 కోట్లతో 46 అభివృద్ధి పనులు జరిగాయి. దీంతో వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆధునికీకరించిన గెడ్డ

ప్రజావసరాలకు యూపీహెచ్‌సీ నిర్మాణం..

వార్డులోని బాలాజీనగర్‌లో ప్రజలకు అందుబాటులో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మించారు. దీనికి రూ. 1.20 కోట్లు ఖర్చు చేశారు. సుమారు 600 చదరపు గజాల విస్తీర్ణంలో భవన నిర్మాణంతో పాటు అన్ని రకాల వైద్య పరికరాలు, ల్యాబ్, 10 పడకలు ఏర్పాటు చేశారు. ఇక్కడ రోగులకు మధుమేహం, బీపీతో పాటు పలు రకాల రక్త పరీక్షలు చేసి, ఉచిత మందులు అందిస్తున్నారు. ఇందులో వైద్యాధికారితో పాటు ఏడుగురు సిబ్బంది సేవలు అందిస్తున్నారు.



బాలాజీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆధునిక కల్యాణ మండపం

11వ వార్డులో అభివృద్ధి పనులు.. వెచ్చించిన నిధులు ఇలా..
రూ. 8 కోట్లతో బాలాజీనర్ (పాత ఆరిలోవ)లో జీవీఎంసీ కల్యాణ మండపం నిర్మాణం (పనులు జరుగుతున్నాయి)
రూ. 5 కోట్లతో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు
రూ. 4 కోట్లతో శ్రీహరినగర్ నుంచి బాలాజీ నగర్ మీదుగా తోటగరువు వరకు గెడ్డ ఆధునికీకరణ
రూ. 1.20 కోట్లతో బాలాజీనగర్‌లో యూపీహెచ్‌సీ నిర్మాణం

గెడ్డల ఆధునికీకరణ..

వార్డు పరిధి శ్రీహరినగర్, డ్రైవర్స్ కాలనీ, బాలాజీ నగర్, గాంధీనగర్ మీదుగా తోటగరువు కూడలి వరకు గల పెద్ద గెడ్డను ఆధునికీకరించారు. దీని అడుగు భాగంలో కాంక్రీట్ వేసి స్థానికులు ఆక్రమించడానికి వీల్లేకుండా ఇరుపక్కలా రక్షణ గోడలు నిర్మించారు. దీని అంచుల్లో పచ్చదనం ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం జీవీఎంసీ సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేస్తోంది.

రూ.8 కోట్లతో ఆధునిక కల్యాణ మండపం..

వార్డు పరిధి బాలాజీనగర్ (పాత ఆరిలోవ)లో రూ.8 కోట్లతో ఆధునిక హంగులతో జీవీఎంసీ కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ఇక్కడ సుమారు అరెకరం విస్తీర్ణంలో ఉన్న పాత కల్యాణ మండపాన్ని తొలగించారు. ఆ స్థలంలో కొత్తది నిర్మిస్తున్నారు. నాలుగంతస్తులుగా దీనిని నిర్మించి కిచెన్, సెల్లార్ పార్కింగ్ సదుపాయాలు కల్పించనున్నారు.

రోడ్ల నిర్మాణం.. కాలువల ఆధునికీకరణ..

వార్డులో రోడ్ల నిర్మాణం, కాలువల ఆధునికీకరణ, నిర్మాణం వంటి పనులు జరిగాయి. బీటీ, సీసీ రోడ్లు, సీసీ కాలువలు నిర్మించారు. వాటి కోసం సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేశారు. వార్డు పరిధి అంబేడ్కర్‌నగర్, పార్వతీనగర్, బాలాజీనగర్, డ్రైవర్స్ కాలనీ, కైలాసనగర్, శ్రీహరినగర్, గాంధీనగర్, రవీంద్రనగర్‌లలో ఈ అభివృద్ధి పనులు జరిగాయి. వీటితో పాటు మరికొన్ని నిధులతో సామాజిక భవనాలు, కొన్ని రోడ్ల మరమ్మతులు, అవసరమైన చోట చేతి బోర్ల ఏర్పాటు, నాడు–నేడులో పాఠశాలల అభివృద్ధి పనులు చేశారు.



అంబేడ్కర్‌నగర్‌లో నిర్మించిన తారు రోడ్డు

ఇప్పుడు రోడ్లు బాగున్నాయి..



అన్ని కాలనీల్లో రోడ్లు, కాలువలు కొత్తగా వేశారు. గతంలో గోతులతో ఉండే రోడ్లతో ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ఆ సమస్య లేదు. తాగునీటి కోసం అందుబాటులో బోరింగులు ఉన్నాయి. రోజూ కుళాయిలు కూడా వస్తున్నాయి. వార్డులో సచివాలయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఏ పని కావాల్సినా అక్కడికి వెళ్తున్నాం. బాలాజీనగర్‌లో పెద్ద కల్యాణ మండపం కడుతున్నారు. అది ఇక్కడ అందరికీ ఉపయోగపడుతుంది. ఇంతటి అభివృద్ధి సంతోషం కలిగిస్తోంది.

– పద్మావతి, ముస్తఫా కాలనీ, 11వ వార్డు

ప్రజలకు అవసరమైన అభివృద్ధి చేస్తున్నాం..



జీవీఎంసీ పరిధిలో అన్ని వార్డుల్లోను అభివృద్ధి పనులు చేస్తున్నాం. అందులో భాగంగా 11వ వార్డులోని డ్రైవర్స్‌కాలనీ నుంచి తోటగరువు వరకు ఉన్న గెడ్డ ఆక్రమణకు గురవుతుండేది. దానికి అడ్డుకట్ట వేయడానికి సుమారు రూ.4 కోట్లతో ఆధునికీకరించాం. బాలాజీనగర్‌లో యూపీహెచ్‌సీ నిర్మించాం. రూ.8 కోట్లతో కల్యాణ మండపం నిర్మిస్తున్నాం. వార్డులో ఇంత వరకు రూ. 22 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. గతంలో ఈ ప్రాంతంలో ఎవ్వరూ చేయని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేయగలిగినందుకు ఆనందంగా ఉంది.

– గొలగాని హరి వెంకటకుమారి, 11వ వార్డు కార్పొరేటర్, నగర మేయర్,

ఎన్నికల నియమావళి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

విశాఖ సిటీ: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, నాలుగు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాలను నియమించారు. ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై ఎంసీసీ బృందాలు విచారణ చేపట్టి నివేదికను సమర్పించనున్నాయి. ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశారు.

తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన అధికారుల వివరాలివి..			
మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు			
టీమ్-1	జె.విజయలక్ష్మి	జోన్-3 జోనల్ కమిషనర్	9912349486
	డి.శంకరరావు	హెచ్‌సీ	9492349001
టీమ్-2	డి.చిన్నకృష్ణ	వయోజన విద్య ఏపీడీ	6300129654
	కె.వి.రమణ	ఏఎస్‌ఐ	9948890009
టీమ్-3	జి.సన్యాసిరావు	స్కూల్ ఎడ్యుకేషన్ సూపరింటెండెంట్	9177292969
	సి.హెచ్.చంద్రశేఖర్	హెచ్‌సీ	9985830796
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు			
టీమ్-1	సి.హెచ్.సూర్యత్రినాథరావు	ఆరిలోవ అసిస్టెంట్ రిజిస్ట్రార్	9381379209
	ఎన్.నీలకంఠం	హెచ్‌సీ	9059149856
టీమ్-2	జి.సందీప్	ఎంవీపీ అసిస్టెంట్ రిజిస్ట్రార్	9948960321
	ఎన్.ఎ.రత్నం	డబ్ల్యూహెచ్‌సీ	9948890009
టీమ్-3	ఫణిభూషణ్‌రెడ్డి	ఏపీఐఐసీ మేనేజర్	9666695714
	కె.అప్పారావు	ఏఎస్‌ఐ	6302194499
టీమ్-4	ఎస్.ఆదినారాయణ	డీఆర్‌డీఏ ఏపీఎం	9866074064
	ఎ.అర్జున్	హెచ్‌సీ	8919852273

వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే నియోజకవర్గ అభివృద్ధి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే విశాఖ తూర్పు నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని విశాఖ ఎంపీ, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 'జనం కోసం.. జనంలోనే' పేరిట చేపట్టిన పాదయాత్ర గురువారం 18వ వార్డులో కొనసాగింది. ప్రజలు నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎంవీవీ 74వ రోజు 18వ వార్డు సెక్టార్–2లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున తనను ఎమ్మెల్యేగా గెలిపించడం ద్వారా తూర్పు నియోజకవర్గ అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తూర్పు నియోజకవర్గం పూర్తి నిర్లక్ష్యానికి గురయిందన్నారు. గత కొంత కాలంగా నియోజకవర్గంలోని అనేక వార్డుల్లో సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నియోజవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు నియంత్రించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : మాతాశిశు మరణాలు నిరోధించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల వ్యవధిలో జిల్లాలో ఆరు మాతృ మరణాలు సంభవించాయన్నారు. లంకెలపాలెంలో రెండు, బక్కన్నపాలెం, ఏకేసీ కాలనీ, కణితి, శ్రామికనగర్ ప్రాంతాల్లో ఒక్కొక్క మరణం సంభవించాయన్నారు. ఈ విషయమై సంబంధిత వైద్యులు, ఏఎన్ఎంల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదన్నారు. ఏఎన్ఎంలు గర్భిణుల పేర్లు నమోదు చేసుకున్ననాటి నుంచి వారికి తగిన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయ ఆస్పత్రుల అధికారి డాక్టర్ రమేష్ కిషోర్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్ రాణి, ఐసీడీఎస్ పీవో జయదేవి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, కేజీహెచ్ ఎనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ జీవీ గణేష్, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ వీవీ శ్రీనివాస రెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్ పి.ఉష, అగనంపూడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌సీవీ నాయుడు, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు, పలు విభాగాల అధిపతులు ఐ.మనోరమ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ: 33/11 కేవీ ఆరిలోవ ఎస్ఎస్ పరిధి హనుమంతవాక 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఈ నెల 30న ఆరిలోవలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పెదగదిలి, ఎస్సీ కాలనీ, సాలిపేట, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, వాణిజ్య పన్నుల విభాగం కార్యాలయం తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఎంపీ ఎంవీవీ సహపంక్తి భోజనం




శివగణేష్‌నగర్‌లో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ గురువారం 19వ వార్డు శివగణేష్ నగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని స్థానికులను ఆరా తీశారు. పథకాల కొనసాగింపునకు రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వాసుపల్లి దాసు, రాములమ్మల నివాసంలో గ్రామపెద్దలు, పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు దాసు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట స్వామికి ఉగాది పురస్కారం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకట స్వామికి మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. తెలుగు భాష, సాహిత్య రంగాలలో ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో వెంకటస్వామి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

మిల్లెట్స్‌తో జీసస్



ఏయూక్యాంపస్: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఉపయోగించి జీసస్ చిత్రపటాన్ని రూపొందించారు. అడుగున్నర పొడవు, అడుగు వెడల్పు కలిగిన ఈ చిత్రాన్ని కేవలం మిల్లెట్స్‌తో తయారు చేయడం విశేషం.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది



టీఐసీ పాయింట్ వద్ద సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

- ఐదేళ్లలో నవరత్నాలతో పేదలకు మేలు
- సీఎం జగన్ సుపరిపాలనతో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి
- ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



సభలో పాల్గొన్న ప్రజలు

ఆరిలోవ: ఐదేళ్లలో నవరత్నాలు అమలు చేసి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఎంతో మేలు చేశారని విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి, సుపరిపాలన అందించిన వైఎస్సార్‌సీపీకే ప్రజలను ఓటు అడిగే హక్కు ఉందన్నారు. మంచి జరిగేతేనే ఓటు వేయాలని అడిగే దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి టీఐసీ పాయింట్ వద్ద కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలసి గురువారం నిర్వహించిన 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తూర్పు నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో వెలగపూడి రామకృష్ణబాబు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మద్యం వ్యాపారం అభివృద్ధి చేసుకున్నారని ఆరోపించారు.

కుట్రలను తిప్పికొట్టాలి

ఎన్నికల్లో పెత్తందార్లతో యుద్ధం చేయడానికి ప్రతీ ఒక్కరు సిద్ధంగా ఉండాలని ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు నాయుడు, ఆయన తోక పార్టీ జనసేన, పచ్చ మీడియా కలసి పన్నుతున్న కుట్రలను మనమంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్ రెడ్డి సింహంలా ఒంటరిగా పోటీ పడుతున్నారన్నారు. ఆయనకు అండగా నిలిచి, న్యాయాన్ని గెలిపిద్దామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్ పాత్రుడు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, స్థానిక నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, బి.ఉమామహేష్, సూర్యారావు, జ్యోతి ప్రకాష్, మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'భరత నాట్యం'



మీడియా సమావేశంలో పాల్గొన్న చిత్ర యూనిట్

బీచ్‌రోడ్డు: క్రైమ్, కామెడీ, థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కించిన చిత్రం భరతనాట్యం అని హీరో సూర్యతేజ అన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో చిత్ర యూనిట్ మీడియా మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ ఇది తన మొదటి చిత్రమని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోందన్నారు. దర్శకుడు కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ గతంలో తాను తీసిన దొరసాని సినిమాతో ఆనంద్ దేవర కొండను హీరోగా పరిచయం చేశానని, ఈ చిత్రం ద్వారా సూర్యతేజను పరిశ్రమకు పరిచయం చేయడం ఆనందంగా ఉందన్నారు. చిత్రాన్ని వచ్చేనెల 5న విడుదల చేస్తున్నామన్నారు. హీరోయిన్ మీనాక్షి గోస్వామి, నిర్మాత పాయల్ సరాఫ్ పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల్లో ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలి



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి గురువారం డీఈవో ఎల్.చంద్రకళకు వినతి పత్రాన్ని అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు మూల్యాంకనం విధులను కేటాయించవద్దని, ఈ విషయంలో వారి అభ్యర్థనను పరిశీలించాలిన కోరారు. దీనిపై డీఈవో సానుకూలంగా స్పందించారని పైడిరాజు తెలిపారు. సంఘం అధ్యక్షుడు దేముడు బాబు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.

సాగర లింగేశ్వరాలయంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎంవీవీ తదితరులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు అప్పుఘర్ తీరంలో ఉన్న శ్రీ సీతారామ సాగర లింగేశ్వర ఆలయంలో షిర్డీసాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్టించారు. అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, దాసు, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.